నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శనివారం 20 జనవరి 2024 | NIZAMABAD




# బడుల్లో ఎన్నికలు

- పాఠశాల యాజమాన్య కమిటీల నియామకానికి సర్వం సిద్ధం
- నేడు నోటిఫికేషన్ విడుదల
- 29న ఎన్నిక • ఉమ్మడి జిల్లాలో 2854 పాఠశాలలు

కామారెడ్డి, జనవరి 19: బడుల్లో ఎన్నికలకు నగారా మోగింది. పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ నేటి(శనివారం) నుంచే ప్రారంభం కానున్నది. ఉదయం 10 గంటలకు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికల్లో పాల్గొనేలా హెచ్ఎంలు నోటీసు జారీ చేయాల్సి ఉంటుంది. మధ్యాహ్నం విద్యార్థుల తల్లిదండ్రుల పేర్లను నోటీసు బోర్డుపై ప్రదర్శించనున్నారు. ఈ నెల 22, 23వ తేదీల్లో ఎన్నికల్లో పాల్గొనే తల్లిదండ్రుల జాబితాపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించి పరిష్కరించనున్నారు. 24న తల్లిదండ్రుల తుది జాబితాను ప్రదర్శిస్తారు. 29న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులను ఎన్నుకొని వారిలో నుంచి ఒకరిని అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. 29వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి ఎన్నికల నివేదిక పంపిస్తారు.

## కమిటీలకు హెచ్ఎంలే కన్వీనర్లు..

పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీలకు (ఎస్ఎంసీ) ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే కన్వీనర్లుగా ఉండనున్నారు. మరో సీనియర్ ఉపాధ్యాయుడు, వార్డు మెంబర్లు, కౌన్సిలర్లు, ఏఎన్ఎం, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, అంగన్‌వాడీ కార్యకర్త.. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా వ్యవహరిస్తారు. ఎన్నికైన సభ్యులతోపాటు ఈ ఆరుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు ఉంటారు. ప్రాథమిక పాఠశాలలో ఎన్నికైన 15మందితోపాటు ఆరుగురు ఎక్స్‌అఫీషియో సభ్యులు, కోఆప్షన్ సభ్యులు మొత్తం 23 మంది ఉంటారు. 7వ తగరతి వరకు 29మంది, 8వ తరగతి ఉంటే 32 మంది, హైస్కూల్‌లో మొత్తం 17మంది సభ్యులు ఉంటారు. వీరితోపాటు ఆయా పాఠశాలల పరిధిలోని విద్యావేత్తలు, పాఠశాల అభివృద్ధికి సహకరించే దాతలను ఎస్ఎంసీ సభ్యులుగా ఎంపిక చేసుకోవచ్చు. పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాలకు సర్పంచు, పురపాలక చైర్మన్లు హాజరవుతారు.

## సభ్యుల ఎన్నిక విధానం

ప్రతి తరగతికి ముగ్గురు సభ్యులను ఎన్నుకుంటారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉంటారు. వీరితోపాటు అనాథ, ఎస్సీ, ఎస్టీ, వలసల, వీధిబాలల, ప్రత్యేక అవసరాల పిల్లల, హెచ్ఐవీ బారినపడిన పిల్లల తల్లిదండ్రుల్లో ఒకరిని ఎన్నుకోవాలి. మరొకరు బలహీనవర్గాలకు చెందిన తల్లిదండ్రులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. మూడో వ్యక్తిని ఎవరినైనా ఎన్నుకోవచ్చు అనే నిబంధనలు విధించారు. ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులు ఉంటే తరగతికి ముగ్గురు చొప్పున 15మందిని, ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి వరకు ఉంటే 21మంది, 8వ తరగతి వరకు ఉంటే 24 మంది సభ్యులను, ఉన్నత పాఠశాలల్లో 6,7,8 తరగతుల తల్లిదండ్రులలో 9మంది సభ్యులుగా ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఎన్నికైన వారు రెండేండ్లపాటు పదవిలో కొనసాగుతారు. ఎన్నికలు జరిగే పాఠశాలలో ఓటర్ల జాబితాలోని తల్లిగాని, తండ్రి లేక సంరక్షకులు ఒకరే ఓటు వేయడానికి అర్హులు. 50శాతం హాజరుకాకపోతే ఎన్నిక నిలిపివేసే అధికారం ఉన్నది. చేతులెత్తే పద్ధతిలో ఓటింగ్ నిర్వహించనున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రహస్య బ్యాలెట్ ఓటింగ్ పద్ధతిని నిర్వహించే అవకాశం ఉంటుంది.

## 29న ఎస్ఎంసీ ఎన్నికలు

ఖలీల్‌వాడి, జనవరి 19 : జిల్లాలో ఈ నెల 29వ తేదీన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.20న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి తల్లిదండ్రుల జాబితాను పాఠశాలల్లో ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. ఈనెల 22న జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి 24న తుది జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. 29న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## అన్ని ఏర్పాట్లు చేశాం...

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేశాం.శనివారం నోటిఫికేషన్ విడుదల చేసి ఈ నెల 29న ఎన్నికలు నిర్వహిస్తాం. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత పాటిస్తాం. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన రోజున సాయంత్రం చైర్మన్, వైస్ చైర్మన్లతో సమావేశం ఏర్పాటు చేస్తాం.

-రాజు, డీఈవో, కామారెడ్డి

మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

# వాడీవేడిగా జడ్పీ సమావేశం

- గృహలక్ష్మి పథకం రద్దుపై ఆగ్రహం
- హాలులో బైఠాయించిన మోర్తాడ్ జడ్పీటీసీ
- రైతు రుణమాఫీ విధివిధానాలు తెలుసుకోండి...
- అధికారులకు జడ్పీ చైర్మన్ ఆదేశం

ఖలీల్‌వాడి, జనవరి 19: నిజామాబాద్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సభ్యులు వివిధ అంశాలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సమావేశం ప్రారంభంలో 15, 16వ ఆర్థిక సంఘం నిధులతోపాటు కేంద్రం నుంచి వివిధ గ్రాంట్ల రూపంలో సమకూరే నిధులు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అందనున్న నిధులు తదితర వాటిపై జడ్పీ సీఈవో గోవింద్ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా గృహలక్ష్మి పథకానికి సంబంధించిన ప్రొసీడింగ్‌లను రద్దు చేయడంపై మోర్తాడ్ జడ్పీటీసీ గంగాధర్ మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేసి అప్పటి మంత్రి, ప్రస్తుత బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మంజూరు పత్రాలను అందజేశారని, వాటికి సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జడ్పీ సమావేశ హాలులో నేలపై బైఠాయించారు. గృహలక్ష్మి పథకాన్ని నమ్ముకొని చాలా మంది పేదలు ఉన్నారని, వారిని ఇబ్బందిపెట్టొద్దని జడ్పీ చైర్మన్, కలెక్టర్లను కోరారు. నిబంధనలకు అనుగుణంగా గ్రామపంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌కు నిర్ణీత నిష్పత్తిలో నిధులు కేటాయిస్తామన్నారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని, నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించాలని సుమనారెడ్డి సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ సమాధానమిస్తూ సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రైతు బంధు నిధులు నెలాఖరులోగా రైతుల ఖాతాల్లో జమయ్యేలా చూడాలని, రైతు రుణమాఫీ విధివిధానాల ఖరారు విషయమై ఉన్నతాధికారులను సంప్రదించాలని జడ్పీచైర్మన్ విఠల్‌రావు జిల్లా వ్యవసాయాధికారికి సూచించారు. ఎత్తిపోతల పథకాల ద్వారా చెరువులను నింపాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉత్తమ ఫలితాలు సాధించేలా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్‌కు సూచించారు.

గృహలక్ష్మి ప్రొసీడింగ్‌ల రద్దును నిరసిస్తూ నేలపై బైఠాయించిన మోర్తాడ్ జడ్పీటీసీ గంగాధర్

## అభివృద్ధి పనులు ఆపొద్దు..

పలు మండలాల్లో ఇప్పటికే ప్రారంభమై వివిధ దశల్లో కొనసాగుతున్న పనులను అర్ధాంతరంగా నిలుపుదల చేస్తున్నారని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. సంబంధిత పనులను నిలిపివేయకుండా యథావిధిగా కొనసాగించేలా చూడాలని ప్రభుత్వానికి విన్నవిస్తూ మోర్తాడ్ ఎంపీపీ శ్రీనివాస్ తీర్మానాన్ని ప్రతిపాదించగా సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో సుందర వరదరాజన్, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

రోడ్డు భద్రతా వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి,జనవరి 19: ప్రమాదాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 15వరకు నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రహదారి భద్రత, జీవన రక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అజాగ్రత్తగా వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరిగి అమూల్యమైన జీవితాలను కోల్పోవాల్సి వస్తున్నదని అన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ఎక్కించుకోవద్దని, మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపొద్దని ఆయన సూచించారు.

### గణతంత్ర వేడుకలను విజయవంతం చేయాలి..

అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గణతంత్ర దినోత్సవ వేడుకలకు జయప్రదం చేయాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. శుక్రవారం అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ గణతంత్ర వేడుకల్లో పాల్గొనాలని అతిథులు, ప్రజాప్రతినిధులకు ఆహ్వానలేఖలను పంపాలన్నారు. సీటింగ్ ఏర్పాట్లు చక్కగా చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. లైటింగ్, పూలతో కలెక్టరేట్‌ను అందంగా అలంకరించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, అదనపు ఎస్పీ నారాయణ రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దేవేందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నార్కోటిక్ డ్రగ్స్ రవాణా చేస్తున్న ఇద్దరు అరెస్టు

కామారెడ్డి/ వినాయక్‌నగర్, జనవరి 19: కామారెడ్డి పట్టణ శివారులో నిర్వహించిన దాడుల్లో కల్తీకల్లులో కలిపే మత్తుపదార్థం అల్ఫాజోలం (నార్కోటిక్ డ్రగ్స్)ను రవాణా చేస్తున్న కదిరి సాగర్ గౌడ్, మాడుగుల సాగర్ గౌడ్‌లను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిజామాబాద్ బృందం శుక్రవారం అరెస్టు చేసింది. నిందితుల నుంచి సుమారు రూ.5లక్షల విలువ చేసే 900 గ్రాముల నార్కోటిక్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారు ఉపయోగించిన రెండు బైకులు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్ తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు వెంకటేశ్, స్వప్న, ఎస్సై రాజ్ కుమార్, సిబ్బంది శ్రీను, ప్రసాద్, ఉత్తం, భోజన్న, విష్ణు, అవినాశ్, రామ్ బచ్చన్ పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం

# యువ ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

- నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

కంఠేశ్వర్, జనవరి 19 : జిల్లాలో ఈనెల 20, 21వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా యువ ఓటర్ల పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధలో భాగంగా శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అసెంబ్లీ నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించి, ఆయా అంశాలపై దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వాములయ్యేలా చూడాలని సూచించారు. ముఖ్యంగా 18 ఏండ్లు నిండిన యువత తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద నిర్ణీత 6/7/8 దరఖాస్తు ఫారాలతో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఓటరు తుది జాబితాల్లో ఏ ఒక్క బోగస్ పేరు ఉండకుండా క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. కొత్త ఓటర్ల గుర్తింపు కార్డుల ప్రింటింగ్ కోసం సమగ్ర వివరాలతో జాబితాను త్వరగా పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 25న విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం మకరంద్, ఆర్డీవోలు రాజేంద్ర కుమార్, వినోద్ కుమార్,రాజాగౌడ్, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

కామారెడ్డి, జనవరి 19 : జిల్లాలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి నేడు (శనివారం) పరీక్ష నిర్వహించనున్నట్లు కామారెడ్డి డీఈవో రాజు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 14 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. తమ వెంట హాల్‌టికెట్,బాల్ పాయింట్ పెన్, పరీక్ష ప్యాడ్‌తో రావాలని పేర్కొన్నారు. పరీక్ష హాలులోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులనూ అనుమతించబోమని స్పష్టం చేశారు.

## ప్రతిభ కళాశాలల్లో ప్రవేశాలకు నేటితో ముగియనున్న గడువు

ధర్పల్లి(డిచ్‌పల్లి), జనవరి 19: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభ కళాశాలల్లో (2024-25) ప్రవేశాలకు ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమన్వయకర్త అలివేలు సూచించారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 4న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్‌ను www.ts wreis.ac.in సందర్శించాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు..

ధర్పల్లి(డిచ్‌పల్లి), జనవరి19: టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్, టీఆర్ఈఐఎస్, ఎంజేపీడబ్ల్యూఆర్ఈఐఎస్ విద్యాలయాల్లో (2024-25) ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు నేటితో ముగియనున్నట్లు రీజినల్ కో-ఆర్డినేటర్ అలివేలు తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూరి వివరాలకు http://tgcet.cgg.gov.in, ww.tswreis.ac.in, hppt:// tgtwgurukulam.telangana.gov.in & http://mjptbcwreic.telangana.gov.in సందర్శించాలని ఆమె కోరారు.

# తోకను వదిలాడు.. నీట మునిగాడు

## ఊపిరాడక బాలుడు మృతి

## బీర్కూర్ మండలం కిష్టాపూర్‌లో ఘటన

శ్రీనివాస్ ఫైల్

నస్రుల్లాబాద్, జనవరి 19: ఆవు తోకను పట్టుకొని చెరువులోకి దిగిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. ఈ సంఘటన బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సోము శ్రీనివాస్ (16) కొన్నేండ్లుగా పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం గ్రామ సమీపంలోని పెద్ద చెరువులోకి ఆవు తోకను పట్టుకొని దిగాడు. చెరువు మధ్యలోకి వెళ్లాక తోకను వదిలేయడంతో ఈత రాక నీట మునిగి మృతిచెందిన ట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ దవాఖానకు తరలించినట్లు ఆయన తెలిపారు.

# మాయమాటలు చెప్పి..

- వృద్ధురాలి నుంచి బంగారు నగలు అపహరణ
- రెంజల్ మండలం నీలా గ్రామంలో ఘటన
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

వృద్ధురాలి నుంచి వివరాలను సేకరిస్తున్న సీఐ శ్రీనివాస్‌రాజు

రెంజల్, జనవరి 19: గ్రామీణ ప్రాంత ప్రజల బలహీనతను ఆసరాగా చేసుకొని కొందరు దుండగులు మాయమాటలు చెప్పి చోరీలకు పాల్పడుతున్నారు. జన సందోహం తక్కువగా ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసుకొని అందినకాడికి దోచుకుంటున్నారు. తాజాగా రెంజల్ మండలం నీలా గ్రామంలో పింఛన్ డబ్బులు ఇవ్వడానికి ఆఫీసర్లు వస్తున్నారంటూ ఓ వృద్ధురాలిని నమ్మించి ఆమె చెవులకు ఉన్న బంగారు నగలను ఎత్తుకెళ్లిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నీలా గ్రామానికి చెందిన అంబెం పోసాని అనే వృద్ధురాలు తన కొడుకు, కోడలు వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లడంతో ఇంటి గడప వద్ద కూర్చున్నది. ఇంతలో అక్కడికి హెల్మెట్ ధరించిన ఓ దుండగుడు బైక్‌పై వచ్చి వృద్ధురాలి ఇంటి ముందు నిలిపాడు. పేదవృద్ధులను గుర్తించి పింఛన్ డబ్బులు ఇవ్వడానికి ఆఫీసర్లు వస్తున్నారని, పాన్‌కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కావాలని, ఒంటిపై బంగారం తీసివే యాలని వృద్ధురాలికి సూచించాడు. వృద్ధురాలిని మరింత నమ్మించడానికి అక్కడే ఉన్న అర్చన అనే బాలికకు రూ.50 ఇచ్చి పాన్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు తీసుకురావాలని పంపించాడు. అనంతరం వృద్ధురాలు తన చెవులకు ఉన్న 12 మాసాల బంగారు నగలను ఓ కవర్లో ఉంచి, ఇంట్లో దాచాలంటూ దుండగుడి చేతికిచ్చింది. దీంతో దుండగుడు ఆమె ఇంట్లోకి వెళ్లి నగలను జేబులో దాచుకొని కవర్‌ను మాత్రమే అక్కడ ఉంచి పరారయ్యాడు. కాసేపటికి జిరాక్స్ తీసుకొని వచ్చిన అర్చన.. ఇంట్లోకి వెళ్లి చూడగా కవర్ మాత్రమే ఉండడంతో దుండగుడు నగలను ఎత్తుకెళ్లినట్లు వృద్ధురాలు తెలుసుకొని బోరున విలపించింది. విషయం తెలుసుకొన్న రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజు, రెంజల్ ఎస్సై పి. ఉదయ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వృద్ధురాలితో మాట్లాడి వివరాలు తెలుసుకొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నారు. చోరీకి పాల్పడిన దుండగుడిని గుర్తించేందుకు సీసీ కెమెరా ఫుటేజీలు,ఆధారాలను సేకరించడానికి మూడు బృందాలను రంగంలోకి దించినట్లు రూరల్ సీఐ తెలిపారు.